ముంపు ముంగిట బోయివీధి



రోడ్డుకు సమీపంలో మత్స్యకారులు నివసిస్తున్న బోయివీధి

- అలల తీవ్రతకు ముందుకొస్తున్న సముద్రం
- కోతకు గురవుతున్న బీచ్ రోడ్డు
- సమీపంలోనే మత్స్యకారుల వీధి
- ఆందోళనలో గంగపుత్రులు



అలల తాకిడికి కోతకు గురైన బీచ్ రోడ్డు

భీమునిపట్నం: భీమిలి బీచ్ రోడ్డు తీవ్రంగా కోతకు గురవడంతో ప్రమాదకరంగా మారింది. అలల తీవ్రత ఉధృతంగా ఉండటం, ఇక్కడి రక్షణ గోడ కొట్టుకుపోవడంతో సముద్రం బాగా ముందుకు వచ్చేస్తోంది. దీంతో సమీపంలోని బోయివీధిలో నివసిస్తున్న మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

తుపాను వస్తే కలవరం

ఈ రోడ్డును ఆనుకుని మత్స్యకారులు నివసిస్తున్న బోయివీధి ఉంది. ఇది సముద్రానికి బాగా దగ్గరగా ఉంటుంది. దీంతో తుపాను సమయాల్లో ఆ ప్రభావం, నష్టం ఇతర ప్రాంతాల కంటే ఇక్కడ ఎక్కువ. 2014లో వచ్చిన హుద్‌హుద్ తుపాను సమయంలో అలలు ఈ ప్రాంతంలోకి చొచ్చుకురావడంతో ఇక్కడ ఎక్కువ నష్టం జరిగింది. ఇప్పుడు పక్కనున్న తీరం కోతకు గురై సముద్రం ముందుకు వస్తుండటంతో మత్స్యకారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇదే పరిస్థితి మరికొంతకాలం కొనసాగితే తుపాను సమయాల్లో అలలు కచ్చితంగా తమ నివాసాల వద్దకు వచ్చేస్తాయని, ప్రమాదాలు జరుగుతాయని కలవరపడుతున్నారు. ఆ ప్రమాదాన్ని నివారించేందుకు ఇక్కడ పటిష్టమైన రక్షణ గోడను నిర్మించాలని వారు కోరుతున్నారు.

ఈ మార్గంలో రోడ్డు పక్కనే అతి సమీపంలో ప్రైవేటు హోటళ్లు ఉన్నాయి. వాటికి మరింత ప్రమాదం వాటిల్లే పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రభుత్వం స్పందించి, తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కొట్టుకుపోయిన రక్షణ గోడ

గతంలో సముద్రానికి, రోడ్డు చాలా దూరంగా ఉండేది. తుపాన్లు, ఆటుపోట్లు సంభవించే సమయాల్లో మాత్రం కొద్దిగా ముందుకు వచ్చేది తప్ప, ఎటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. కానీ, కొద్ది సంవత్సరాల నుంచి సముద్రం ముందుకు రావడం మొదలైంది. క్రమేపీ అది రోడ్డు రక్షణ గోడ వరకు వచ్చింది. తుపాను సమయాల్లో అలలు బలంగా గోడకు తాకడంతో కొద్ది సంవత్సరాల క్రితం రక్షణ గోడ కొట్టుకుపోయింది. దీంతో అలలు మరింత ముందుకు చొచ్చుకు రావడం మొదలై, గట్టు దాని తర్వాత రోడ్డు కూడా కోతకు గురవుతూ వస్తోంది. దీంతో అధికారులు అలలు ముందుకు రాకుండా అక్కడ బండరాళ్లను వేయించారు, కాని దానివల్ల పెద్దగా ప్రయోజనం లేకపోయింది. ఇటీవల వచ్చిన తుపాన్ల ప్రభావంతో సముద్రం ఇంకా ముందుకు రావడంతో రోడ్డు మరింత కోతకు గురైంది.

కంటిపై కునుకు ఉండట్లేదు



మొన్న తుపాను సమయంలో సముద్రం మా ఇళ్ల వచ్చేస్తుందని చాలా భయమేసింది. అదృష్టవశాత్తు రాలేదు. కానీ సముద్రం బాగా ముందుకు వచ్చేసి, తీరం బాగా కోతకు గురవుతోంది. ముందు ముందు ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. ముసురేస్తే కంటిమీద కునుకు ఉండటం లేదు. **–గొరక ఈశ్వరమ్మ, బోయివీధి, భీమిలి**

రక్షణ గోడ నిర్మించాలి



ఇక్కడ పరిస్థితి చాలా ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదు. పెద్ద అలలను తట్టుకోవాలంటే తీరంలో పటిష్టమైన రక్షణ గోడ నిర్మించాలి. జాప్యం జరిగితే ముప్పు ముంచుకొచ్చేస్తుంది. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి. **– కదిరి ఎల్లయ్య, బోయివీధి, భీమిలి**

ప్రతిపాదనలు పంపిస్తాం

ఇక్కడ రోడ్డు కోతకు గురవుతున్నందున రాబోయే రోజుల్లో జనావాసాలకు ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. దీనిపై పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి ఇక్కడ పటిష్టమైన రక్షణ గోడ నిర్మాణానికి అంచనాలు రూపొందిస్తాం. ప్రభుత్వానికి పంపిస్తాం. **–శాంతకుమార్ రాజు, పబ్లిక్ వర్క్స్ ఈఈ**

తీరంలో దంచికొట్టిన వాన



పరదేశిపాలెం గెడ్డను దాటుకుని వస్తున్న స్థానికులు



పీఎం పాలెం ఆఖరి బస్టాప్‌నకు వెళ్లే ప్రధాన మార్గంలో నిలిచిన నీరు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డులో గురువారం ఉదయం నుంచి విరామం లేకుండా కురిసిన వానకు రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు భారీగా చేరుకుంది. పరదేశిపాలెం గెడ్డ వద్ద వరద ఉధృతి తీవ్రరూపం దాల్చింది. సాగర్‌నగర్, రుషికొండలలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రుషికొండలో బోటు షికారు నిలిపివేశారు.

మధురవాడలో మోస్తరు వర్షం

మధురవాడ: మధురవాడ పరిసర ప్రాంతాల్లో గురువారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం 11 గంటల తర్వాత వాతావరణం ఒక్కసారిగా మారిపోయి, మోస్తరు వాన పడింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరింది. ముఖ్యంగా చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆట స్థలం చెరువును తలపించింది. రాకపోకలకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



పీఎం పాలెంలో రోడ్డుపై ప్రవహిస్తున్న వాననీరు

పీఎం పాలెంలో..

పీఎం పాలెం: భారీ వర్షానికి ఆరో వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. కారు షెడ్ కూడలి నుంచి పీఎం పాలెం ఆఖరు బస్టాపునకు వెళ్లే 80 అడుగుల రోడ్డులో వాన నీరు నిలిచిపోవడంతో పాదచారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఆర్‌హెచ్ కాలనీ, గాయత్రీ నగర్ జేఎస్ఎన్ యూఆర్ఎం కాలనీ బాబానగర్, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర కాలనీల్లో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

రెండు షాపులు అగ్నికి ఆహుతి

భీమునిపట్నం: భీమిలిలో కృష్ణాకాలనీ బస్టాప్ పక్కన వియ్యపు తౌడు అనే వ్యక్తికి చెందిన రెండు షాపులు దగ్ధమయ్యాయి. ఇక్కడ కిరాణా షాపు, పాన్ షాపు కలిసి ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి సమయంలో దుకాణాల్లోంచి మంటలు రావడంతో చుట్టుపక్కలవారు చూసి తౌడుకు విషయాన్ని తెలిపారు. అతను అగ్నిమాపక కేంద్రం వారికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. కాని అప్పటికే ఈ రెండు షాపుల్లో ఉన్న నిత్యావసర సరకులతో పాటు రెండు ఫ్రిజ్‌లు పూర్తిగా కాలిపోయాయి. దీంతో రూ.3 లక్షల విలువైన సరకులు, రూ.2 లక్షల విలువైన షాపులు కలిపి సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. అలాగే ఈ షాపుల పక్కనే పీతల వెంకటరావు అనే వ్యక్తికి చెందిన టైలరింగ్ షాపు పాక్షికంగా దెబ్బ తింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఎస్ఐ గౌరి కాలిపోయిన షాపులను గురువారం పరిశీలించారు.



దగ్ధమైన షాపులు

పూరిళ్లు, ధాన్యం గాదెలు దగ్ధం

తగరపువలస: భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ అల్లుపేటలో గురువారం ఉదయం మూడు పూరిళ్లు, మూడు ధాన్యం గాదెలు పూర్తిగా కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్ లేదా ఇంట్లో దీపం కారణంగా ఈ అగ్నిప్రమాదం జరిగి ఉంటుందని తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో ఆ ఇళ్లల్లో ఎవరూ లేరు. పనుల కోసం బయటికి వెళ్లిపోయారు. ఈ ప్రమాదంలో అల్లు సూర్యానారాయణ, అల్లు అప్పన్న, అల్లు శ్రీను, అల్లు ముత్యాలు, అల్లు లక్ష్మణకు చెందిన ఆస్తులు సుమారు రూ.12 లక్షల వరకు నష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో పక్కనే ఉన్న అల్లు చంద్రయ్య అనే వ్యక్తికి చెందిన ఆర్‌సీసీ ఇల్లు బీటలు వారింది. తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.



అల్లుపేటలో కాలిపోయిన పూరిళ్లు, ధాన్యం గాదెలు

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

పీఎం పాలెం: ప్రాథమిక విద్య దశలో క్రమశిక్షణ అలవరచుకుంటే భవిష్యత్తులో ఉన్నత విద్యావంతులు కాగలరని విశాఖ అటవీ రేంజ్ అధికారి శ్రీరామ్ నరేష్ బిర్లంగి అన్నారు. నరేష్ తండ్రి తవిటినాయుడు జ్ఞాపకార్థం బీటీ నాయుడు ట్రస్ట్ సహకారంతో గిరిజన గ్రామం శంభువానిపాలెంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం ఆయన నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న విశాఖ అటవీ రేంజ్ అధికారి శ్రీరామ్ నరేష్

క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన ముత్తంశెట్టి



మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఆయన కుమారుడు శివ సందీష్ గురువారం కలిశారు. ఈ సందర్భంగా పలు విషయాలను వైఎస్ జగన్ దృష్టికి ముత్తంశెట్టి తీసుకువెళ్లారు.

3 నుంచి విజయదుర్గాదేవి ఆలయంలో దసరా ఉత్సవాలు

తగరపువలస: అక్టోబర్ 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు బైపాస్ రోడ్డులోని శ్రీవిజయదుర్గాదేవి, విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో దసరా ఉత్సవాలు నిర్వహించనున్నారు. పది రోజుల పాటు అమ్మవారు దివ్యాలంకరణలతో భక్తులకు దర్శనాలు కల్పించనున్నారు. 9వ తేదీన మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీ దేవికి సహస్ర కుంకుమార్చన, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వివరాలకు 98660 30895 నంబరులో సంప్రదించాలని ఆలయ కమిటీ ప్రతినిధి రాజగిరి కుసుమహర తెలిపారు.

శరణ్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో రేపు పూజలు

తగరపువలస: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆనందపురం మండలం బోయిపాలెం పైడా కళాశాల ఆవరణలోని శరణ్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పూజలు నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం గురించి రాజకీయ దుర్బుద్ధితో అబద్ధాలాడుతున్న కూటమినేతల పాపప్రక్షాళనకు గాను ఉదయం 9 గంటల నుంచి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూజలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, అభిమానులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

వరద బాధితులకు రూ.10 లక్షల విరాళం



లోకేష్‌కు చెక్ అందజేస్తున్న మస్తానరావు కుటుంబ సభ్యులు

కొమ్మాది: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు నగరానికి చెందిన హిందూస్తాన్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ పి.ఎస్.మస్తానరావు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. బీచ్ రోడ్డులోని ఓ రిసార్ట్‌లో రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కలసి ఈ మొత్తం చెక్‌ను అందించారు. ఆయన కుటుంబ సభ్యులు కుంకుమ రేఖ, భరత్, శ్రీలేఖ పాల్గొన్నారు.

మంత్రికి బిల్డర్ల వినతి

కొమ్మాది: బిల్డర్లపై భారం పడేలా గత నెల 20న ప్రభుత్వం జారీ చేసిన మెమో నంబర్ 1768902/హెచ్1/2024 పై దృష్టి సారించాలని పలువురు బిల్డర్లు మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందించారు. ఇప్పటికే తాము అనేక విధాలుగా ఇబ్బంది పడుతున్నామని, ఈ మెమో వలన ఆర్థికంగా మరింత నష్టపోతామని చెప్పారు. ఈ విషయాన్ని తాము మంత్రి నారాయణ దృష్టికి కూడా తీసుకువెళ్లామన్నారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేష్ ఈ విషయంపై ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయన్నారు. మంత్రిని కలిసిన వారిలో పి.వి.ఆది నారాయణ, పి.వెంకట మణి, పృథ్వి, దిలీప్ తదితరులున్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ





దర్బారులో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, ప్రసంగిస్తున్న 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ

పీఎం పాలెం: రాష్ట్రంలోని ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్లలో ఉత్తమ బెటాలియన్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేపీ మురళీకృష్ణ అన్నారు. బక్కన్నపాలెం పోలీస్ బెటాలియన్ కేంద్రంలో సిబ్బంది సమస్యలపై గురువారం నిర్వహించిన దర్బారులో ఆయన ప్రసంగించారు. గతంలో నిర్వహించిన దర్బారులో సిబ్బంది వ్యక్తపరచిన ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలు పరిష్కరించడానికి అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు. అధికారులు, సిబ్బంది ఉత్తమ సేవలు అందించడం ద్వారా బెటాలియన్‌కు మంచి గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. స్థానిక సిబ్బంది, అధికారులు తమ వ్యక్తిగత, ఉద్యోగాలకు సంబంధించిన సమస్యలను దర్బారులో తెలియజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ సీహెచ్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెంట్‌లు సత్యం, నారాయణ, డీఎస్పీ ఏలియాసాగర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'చిలకమర్తి'కి విద్యార్థుల నివాళి

తగరపువలస: తెలుగు సాహిత్య అభివృద్ధికి, తెలుగునాట ఆధునిక భావాల వికాసానికి పట్టుగొమ్మలైన వారిలో కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం ఒకరని బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు అన్నారు. గురువారం చిలకమర్తి జయంతి సందర్భంగా ఆయన గురించి విద్యార్థులకు వివరించారు. 22 ఏళ్ల వయసులో ఆయన రచించిన గయోపాఖ్యానం నాటక ప్రతులు లక్షకు పైగా అమ్ముడుపోవడం తెలుగు సాహిత్య చరిత్రలో అరుదైన విషయమన్నారు.

- ఈశ్వరచంద్ర విద్యాసాగర్ జయంతి సందర్భంగా ఆయన గురించి హెచ్ఎం అప్పలరాజు వివరించారు. మహిళల జీవనగతిని మెరుగుపరచడానికి ఆయన చేసిన అలుపెరగని ఉద్యమం, ఫలితాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. అనంతరం వీరిద్దరికీ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ షేక్ షర్మిల, ఉపాధ్యాయుడు బుగత మల్లిక, నరహరిశెట్టి రమేష్ పాల్గొన్నారు.

గెడ్డను మింగేస్తున్నారు

- రూ. 80 లక్షల స్థలంపై టీడీపీ నాయకుడి కన్ను
- గత ప్రభుత్వ హయాంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు
- దానిని తొలగించి మరీ షెడ్ల నిర్మాణం
- పిల్ల కాల్వలా మారిపోతున్న గెడ్డ



మారికవలసలో గెడ్డ స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)



ప్రభుత్వ హెచ్చరిక బోర్డు మాయం చేసి చేపడుతున్న నిర్మాణం



ఆక్రమణలకు ముందు గెడ్డ ఇలా..



ఆక్రమణలతో పిల్ల కాలువలా మారిపోయిన గెడ్డ

మధురవాడ: స్థానిక టీడీపీ నాయకుడు అక్రమాలకు తెరతీశాడు. పరదేశిపాలెం రెవెన్యూ గ్రామంలో గెడ్డ దిశను మార్చేసి మరీ ఆక్రమణకు స్కెచ్ వేశాడు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరే అతడు ప్రభుత్వం మారడంతో రెచ్చిపోతున్నాడు. గత ప్రభుత్వం హయాంలో గెడ్డ స్థలమని తేల్చి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినా.. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఆక్రమణల పర్వం మొదలుపెట్టేశాడు. దీంతో ఆ ప్రాంతంలోని పెద్ద గెడ్డ ఇప్పుడు పిల్ల కాలువలా మారిపోయింది.

ఆక్రమణ ఇలా..

పరదేశిపాలెం రెవెన్యూ గ్రామం సర్వే నంబర్ 94లోని గెడ్డ పోరంబోకు స్థలంలో రెవెన్యూ అధికారులను మచ్చిక చేసుకుని హెచ్చరిక బోర్డును మాయం చేశారు. జిల్లా మెజిస్ట్రేట్ అయిన కలెక్టర్ పేరుతో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును తొలగించినా, రెవెన్యూ ఉన్నతాధికారులు, వీఆర్వోలు కనీసం పట్టించుకోలేదు. దీంతో ఆ వ్యక్తి ఈ సర్వే నంబరులో సుమారు రూ.80 లక్షలు విలువ చేసే 200 గజాల ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నాడు.

ఇక్కడ కొంత జిరాయితీ భూమి ఉందని సదరు ఆక్రమణదారులు చెబుతున్నారు. వారు జిరాయితీ అని చెపుతున్న భూమి కూడా ప్రభుత్వ భూమికి తప్పుడు సర్వే నంబర్లు వేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నదే అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గంటా అనుచరులమంటూ..

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రధాన అనుచరుల పేరు చెప్పి ఈ దందా అంతా సాగిస్తుండడంతో రెవెన్యూ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికార పార్టీ నాయకులను ఉన్నత స్థాయి అధికారులు కూడా ఎదిరించలేక పోవడంతో కింది స్థాయి సిబ్బంది కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవేళ వారు చెప్పినట్లుగా కొంత జిరాయితీ ఉన్నా దానికి ప్లాన్, వీఎల్‌టీ వంటివి ఏమీ లేకుండా 4 షెడ్లు నిర్మించేస్తున్నారు. దీనిపై ఉన్నత స్థాయి అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. దీనిపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆర్ఐ ప్రవీణ్ కుమార్ అందుబాటులోకి రాలేదు. వీఆర్వోను సంప్రదించగా సర్వే పనులు నిలుపుదల చేయించామని తెలిపారు.

పౌష్టికాహారంతో రక్తహీనత నివారణ



అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత

కొమ్మాది: గర్భిణులు, బాలింతలు తరచూ రక్తహీనతతో బాధపడుతుంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సరిత అన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్త హీనతను అరికట్టవచ్చన్నారు. జీవీఎంసీ 8వ వార్డు వాడపాలెంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, చిరు ధాన్యాలు తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కోమలి, ఆశ వర్కర్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

తగరపువలస: బాలింతలు, గర్భిణులు విధిగా ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ భీమిలి పీడీ శ్రీదేవి, అర్బన్ సూపర్‌వైజర్ కె.ప్రమీల అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా గురువారం వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ కుషాల్ మెటర్నిటీ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో కుషాల్ ప్రాజెక్టు నుంచి పార్వతి, రాశి, జిల్లెల దేవి, ఆశవర్కర్లు, ఏఎన్ఎంలు, జీవీఎంసీ భీమిలి జోన్ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సంతపేట అంగన్వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కందిరీగల దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



జగన్నాథరావు(ఫైల్)

పద్మనాభం: మండలంలోని కోరాడలో కందిరీగల దాడిలో గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. పద్మనాభం పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కోరాడ గ్రామానికి చెందిన మీసాల జగన్నాథరావు(47) వేరే వ్యక్తి దగ్గర ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 17వ తేదీన ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా కందిరీగలు దాడి చేసి, జగన్నాథరావును గాయపరిచాయి. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించారు. కొద్ది రోజులు చికిత్స పొందిన అనంతరం బాగుండడంతో జగన్నాథరావు ఇంటికి వచ్చేశారు. మళ్లీ ఈ నెల 25వ తేదీన బాగులేకపోవడంతో విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా, అక్కడి వైద్యులు కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ 25న సాయంత్రం ఆరు గంటల సమయంలో జగన్నాథరావు మృతి చెందాడు. మృతుడి భార్య దుర్గా భవాని గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య దుర్గా భవాని, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వీధిలైట్లు లేక అవస్థలు



వీధి లైట్లు వెలగని ప్రాంతం

మధురవాడ: జీవీఎంసీ 7వ వార్డు ఐటీ జంక్షన్ నుంచి మానం ఆంజనేయులు కాలనీకి వెళ్లే రోడ్డులో పలు చోట్ల వీధి లైట్లు లేక స్థానికులు,కూలీలు, విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ కాలనీతో పాటు ఓ ప్రైవేటు విద్యా సంస్థ బాలికల హాస్టల్ ఉంది. ఇక్కడి వారు ఏ చిన్న పని ఉన్నా ఐటీ సెజ్ జంక్షన్ మీదుగా మధురవాడ, కార్‌షెడ్, వుడా కాలనీ ప్రాంతాలకు వెళ్లాలి. రాత్రి వేళల్లో వీధి లైట్లు వెలగకపోవడంతో ఆగంతకుల బెడద, విషపురుగుల భయంతో స్థానికులు బయటకు వెళ్లలేకపోతున్నారు. ఇటీవల చీకటి పడిన తర్వాత ఇంటికి వెళ్తున్న మహిళపై ఓ ఆగంతకుడు అఘాయిత్యానికి ప్రయత్నించగా కేకలు వేసుకుంటూ కాలనీలోకి పరుగులు తీసింది. ఈ ఘటన జరిగినప్పటికి నుంచి మహిళలు, బాలికలు చీకటి పడితే బయటికి వెళ్లాలంటేనే హడలిపోతున్నారు. ఇక్కడ పోల్ నంబర్ 11కేవీ/ఎన్‌జీపీ/102 పరిసర ప్రాంతాల్లో అరడజను పైగా వీధి లైట్లు వెలగడంలేదు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.